క్లుప్తంగా

పెండింగ్ బిల్లులు చెల్లించాలి



ఎంపీడీఓ కార్యాలయం ఎదుట కార్మికుల ఆందోళన

హత్నూర(సంగారెడ్డి): పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులకు తక్షణమే పెండింగ్ బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేస్తూ హత్నూర మండల పరిషత్ కార్యాలయం ఎదుట కార్మికులు గురువారం ఆందోళన చేపట్టారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రకటించిన విధంగా వేతనాల పెంపుతో పాటు ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. జీఓ 60 ప్రకారం వేతనాలు చెల్లించాలని కోరారు. ఈఎస్ఐ, పీఎఫ్, ప్రమాద బీమా తదితర వాటిని అమలు చేయాలన్నారు. ప్రభుత్వం స్పందించకపోతే అత్యవసర సేవలు నిలిపివేస్తామని హెచ్చరించారు.

కార్మికులకు కనీస వేతనం అందజేయాలి: సీఐటీయూ

సదాశివపేట(సంగారెడ్డి): కార్మికులకు పెరిగిన ధరలకు అనుగుణంగా కనీస వేతనం రూ. 21 వేలు ఇవ్వడంతో పాటు పర్మనెంట్ చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్ డిమాండ్ చేశారు. గురువారం ఎంపీడీఓ కార్యాలయం వద్ద పంచాయతీ కార్మికులు ఒక రోజు సమ్మె నిర్వహించారు. ఈసందర్భంగా అయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు పంచాయతీ కార్మికుల వేతనాలు పెంచుతామని, సిబ్బందిని పర్మనెంట్ చేస్తామని హామీ ఇచ్చి అమలు చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు శేఖర్, సంజీవులు, నగేష్, అనందం, మహేష్, రామచందర్, మైపాల్, పోచయ్య, యాదమ్మ, సుమలత తదితరులు పాల్గొన్నారు.

దోమల నివారణకు చర్యలు



మాట్లాడుతున్న కార్పొరేటర్ కుమార్ యాదవ్

పటాన్‌చెరు టౌన్: దోమల నివారణకు చర్యలు తీసుకుంటున్నామని కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ అన్నారు. స్వచ్ఛదనం- పచ్చదనం కార్యక్రమంలో భాగంగా పటాన్‌చెరు డివిజన్ పరిధిలో పరిసరాలను శుభ్రం చేయించారు. కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్ సురేష్ కుమార్, వెంకటేశ్వర్లు, ఏఈ శివకుమార్, రామ్‌కి సంస్థ డివిజన్ సూపర్‌వైజర్ సుమన్, జీహెచ్ఎంసీ సిబ్బంది పాల్గొన్నారు.

గంజాయి సరఫరా చేస్తే కఠిన చర్యలు



వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

న్యాల్‌కల్(జహీరాబాద్): ప్రభుత్వం నిషేధించిన పొగాకు ఉత్పత్తులతో పాటు గంజాయి, డ్రగ్స్‌ను సరఫరా చేస్తే కఠిన చర్యలు తప్పవని జహీరాబాద్ రూరల్ సీఐ హన్మంత్ హెచ్చరించారు. గురువారం సాయంత్రం మండల పరిధిలోని ముంగి చౌరస్తా వద్ద పోలీస్ సిబ్బందితో కలసి వాహనాలను తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పొగాకు, గుట్కాతో పాటు గంజాయి లాంటి మత్తు పదార్థాలను సరఫరా చేస్తే వాహనాలను సీజ్ చేయడంతో పాటు కేసు నమోదు చేస్తామన్నారు. అదేవిధంగా వాహనాల ధ్రువపత్రాలు, డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో హద్నూర్, ఝరాసంగం, రాయికోడ్ ఎస్ఐలతో పాటు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పాలిటెక్నిక్‌లో అడ్మిషన్లు

నారాయణఖేడ్: స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఈసీఈ, ఈఈఈ కోర్సుల్లో మిగిలిన సీట్ల భర్తీ కోసం శుక్రవారం నుంచి ఈనెల 11 వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డా.రాజేశ్వరి తెలిపారు. ఖాళీ సీట్ల వివరాలను నోటీసు బోర్డులో ఉంచామన్నారు. 12న ఉదయం 10 గంటల నుంచి కౌన్సెలింగ్ నిర్వహిస్తామని తెలిపారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఒరిజినల్ ధ్రువపత్రాలోపాటు ప్రాసెసింగ్ ఫీజు రుసుం రూ.700 చెల్లించాల్సి ఉంటుందన్నారు. వివరాల కోసం కళాశాలలో నేరుగా లేదా 81435-04002 నంబరులో సంప్రదించాలని సూచించారు.

స్వచ్ఛదనంతో ఆరోగ్యం

పర్యావరణాన్ని పరిరక్షించడంలో భాగంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వచ్ఛదనం–పచ్చదనం కార్యక్రమం గురువారం కూడా జిల్లావ్యాప్తంగా ఉత్సాహంగా నిర్వహించారు. అధికారులు, నేతలు పాల్గొని ఆయా గ్రామాలు, పట్టణాల్లో మొక్కలు నాటారు. పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. ప్రతీ ఒక్కరు మొక్కలు నాటాలని సూచించారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని కోరారు.



కంది(సంగారెడ్డి): మొక్కలు నాటుతున్న డీన్ సత్యనారాయణ



నారాయణఖేడ్: అవగాహన కల్పిస్తున్న అఖిల



కంగ్టి: కాల్వల్లో పూడికతీత పనులు పరిశీలిస్తున్న నూతన్‌కుమార్



మాట్లాడుతున్న ఎంపీపీ సుభాష్



కార్యక్రమంలో పాల్గొన్న ఎంఈఓ బస్వరాజ్



బస్తీ దవాఖానలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న కమిషనర్ సంగారెడ్డి



ఝరాసంగం(జహీరాబాద్): పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ, వైద్యాధికారి

న్యాయవాదుల విధుల బహిష్కరణ

జోగిపేట(అందోల్): జనగామ జిల్లా న్యాయవాదులు అమృతారావు, కవితలపై పోలీసుల దాడిని నిరసిస్తూ గురువారం జోగిపేట బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విధులను బహిష్కరించారు. జూనియర్ సివిల్ కోర్టు జడ్జి ధనలక్ష్మికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ నాయకులు మాట్లాడుతూ రోజు రోజుకూ న్యాయవాదులపై పోలీసుల దాడులు పెరిగిపోతున్నాయన్నారు. దాడికి నిరసనగా రెండు రోజులపాటు కోర్టులో విధులు బహిష్కరిస్తున్నట్లు ప్రకటించారు. కాగా, పోలీసుల దాడి మరోసారి పునరావృతం కాకుండా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ సీనియర్ నాయకులు ఎస్. కృష్ణారెడ్డి, ఎస్. నారాయణరెడ్డి, టి.సంగమేశ్వర్, న్యాయవాదులు అల్లే శ్రీకాంత్, సార వెంకటేశం, శివప్రసాద్, లింగమయ్య, నర్సింహులు, మల్లేశం, వెంకటకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు డబుల్ బెడ్రూం ఇళ్లు కేటాయించాలి

నారాయణఖేడ్: నారాయణఖేడ్ మున్సిపాలిటీ పరిధిలోని అర్హులైన పేదలకు వెంటనే డబుల్‌బెడ్‌రూం ఇళ్లను కేటాయించాలని కోరుతూ గురువారం నారాయణఖేడ్ ఆర్డీఓ అశోక చక్రవర్తికి సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు అతిమేల మాణిక్ వినతిపత్రాన్ని అందజేశారు. పట్టణ సమీపంలో జూకల్ శివారులో నిర్మించిన ఇళ్లు కేటాయించక పోవడంతో శిథిలావస్థకు చేరుతున్నాయని తెలిపారు. చాలామంది పేదలు ఇళ్లులేక అద్దెఇళ్లల్లో ఉంటూ అద్దెలు చెల్లించలేక ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. అసంపూర్తిగా ఉన్న పలు ఇళ్లను త్వరితగతిన పూర్తిచేసి కేటాయించాలని కోరారు. నాయకులు రమేష్, కాన్షీరాం, అరుణ్, సంతోష్, మహిపాల్ తదితరులు పాల్గొన్నారు.

సూచిక బోర్డు కనిపించేలా..

న్యాల్‌కల్(జహీరాబాద్): మండల పరిధిలోని ముంగి చౌరస్తా వద్ద సూచిక బోర్డును కమ్మేసిన పిచ్చి మొక్కలు, తీగలను జహీరాబాద్ రూరల్ సీఐ బి.హన్మంత్ తొలగించారు. గురువారం సాయంత్రం ముంగి చౌరస్తా వద్ద వాహనాలను తనిఖీ చేస్తుండగా.. అక్కడే ఉన్న సూచిక బోర్డు పిచ్చి మొక్కలు, తీగలతో కప్పి వేయడం కనిపించింది. స్పందించిన ఆయన సిబ్బందితో కలసి పిచ్చి మొక్కలు, తీగలను తొలగించారు. దీంతో బోర్డు ఎప్పటిలాగే కనిపించింది.



ముంగి చౌరస్తా వద్ద సూచిక బోర్డును కమ్మేసిన పిచ్చి మొక్కలు, తీగలు

ఇండోర్ స్టేడియం ఏర్పాటు చేయండి

కొండాపూర్(సంగారెడ్డి): జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలో ఇండోర్ స్టేడియంతో పాటు 400 మీటర్ల రన్నింగ్ ట్రాక్‌ను ఏర్పాటు చేయాలని మంజీరా స్పోర్ట్స్ క్లబ్ జిల్లా అధ్యక్షుడు మాణయ్య కోరారు. ఈ మేరకు గురువారం సంగారెడ్డిలో మంత్రి దామోదర రాజనర్సింహను కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ క్రీడలపరంగా జిల్లా నుంచి ప్రాతినిధ్యం లేక పోవడం దురదృష్టకరమన్నారు. గతంలో అనేక స్పోర్ట్స్ అకాడమీలు ఉండడంతో సంగారెడ్డి నుంచి క్రీడాకారులు రాష్ట్ర స్థాయి, జాతీయ స్థాయిలో రాణించి అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందారన్నారు. జాతీయ జట్టుకు కబడ్డీ కోచ్‌గా వ్యవహరించిన శ్రీనివాస్‌రెడ్డి కూడా సంగారెడ్డి ప్రాంతానికి చెందినవారే అని గుర్తు చేశారు. క్రమంగా సంగారెడ్డి నుండి స్పోర్ట్స్ అకాడమీలను ఇక్కడి నుండి తరలించడంతో జిల్లా కు క్రీడల పరంగా తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. పట్టణంలో ఒక క్రీడా పాఠశాలను ఏర్పాటు చేయడంతో పాటు అంబేడ్కర్ క్రీడా ప్రాంగణంలో అన్ని క్రీడలకు సంబంధించి కోచ్‌ను నియమించాలని, ప్రాంతీయ క్రీడా అకాడమీని ఏర్పాటు చేసి తగిన వసతులు కల్పించాలని కోరారు. మంజీరా స్పోర్ట్స్ క్లబ్ జిల్లా కార్యదర్శి విఠల్ తదితరులున్నారు.



మంత్రి దామోదర రాజనర్సింహకు వినతి పత్రం అందజేస్తున్న మంజీరా స్పోర్ట్స్ క్లబ్ నాయకులు

విరాళాల సేకరణ

సదాశివపేట(సంగారెడ్డి): కేరళలోని వాయనాడ్ ప్రజలను ఆదుకునేందుకు తమ వంతుగా విరాళాలు ఇవ్వాలని సీపీఐ పట్టణ కార్యదర్శి వినోద పిలుపునిచ్చారు. గురువారం పట్టణ పార్టీ నాయకులు వాయనాడ్ ప్రజలను అదుకునేందుకు విరాళాలు సేకరించారు. కార్యక్రమంలో నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నారాయణఖేడ్‌లో..

నారాయణఖేడ్: కేరళలోని వయనాడ్ వరద బాధితుల కోసం ఖేడ్‌లో సీపీఎం ఆధ్వర్యంలో విరాళాలు సేకరించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు మాణిక్, ఖేడ్ డివిజన్ బాధ్యులు రమేష్, సంతోష్, శ్రీనివాస్, అరుణ్, మహిపాల్ తదితరులు ఉన్నారు.

రిటైర్డ్ ఉద్యోగుల సంక్షేమానికి కృషి చేయాలి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేయాలని రిటైర్డ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర సెక్రటరీ జనరల్ చంద్రశేఖర్ కోరారు. గురువారం రామచంద్రాపురం పట్టణంలో మండల ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించేందుకు తమ వంతు కృషి చేస్తామని తెలిపారు. అందరూ ఐక్యంగా ఉన్నప్పుడే హక్కులను సాధించుకోవచ్చు అని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు మోహన్ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు నర్సారెడ్డి, ప్రధానకార్యదర్శి మురళీధర్, రామచంద్రాపురం మండల అధ్యక్షుడు శంకరం గౌడ్, నాగభూషణం, రాములు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న రిటైర్డ్ ఉద్యోగుల సంఘం నాయకులు

సేంద్రియ సాగుతో భూసారం పెంపు

చేగుంట(తూప్రాన్): సేంద్రియ సాగుతో భూసారం పెంచుకోవాలని సెహగల్ ఫౌండేషన్ ప్రోగ్రాం లీడర్ వాణి పేర్కొన్నారు. మండలంలోని పోతాన్‌పల్లి గ్రామంలో గురువారం మహిళా రైతులకు ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన భూసార పరీక్ష పత్రాలను అందించారు. ఈ సందర్భంగా వాణి మాట్లాడుతూ.. పంటలకు అవసరమైన మోతాదులోనే సూక్ష్మ, స్థూల పోషకాలను అందించాలని తెలిపారు. ఫౌండేషన్ అందించిన విత్తనాలు వ్యవసాయ పరికరాలతో ఎలా లబ్ధిని పొందారని నవనీత్‌అగర్వాల్ మహిళా రైతులను అడిగి తెలుసుకున్నారు. రైతులకు వ్యవసాయంలో క్షేత్రస్థాయిలోనే సాంకేతిక అంశాలపై సహకారాం అందిస్తామని అవినాష్ చెప్పారు.

రైతుబీమాకు 748 దరఖాస్తులు

రాయికోడ్(అందోల్): ఈ నెల 7వ తేదీతో రైతుబీమా దరఖాస్తు గడువు పూర్తయిందని, 748 మంది రైతులు దరఖాస్తు చేసుకున్నట్లు మండల వ్యవసాయ అధికారి అబినాష్ వర్మ తెలిపారు. దరఖాస్తు దారుల వివరాలను పరిశీలించి ఆన్‌లైన్ ఎంట్రీ కూడా పూర్తి చేశామన్నారు. గతంలోనే రైతుబీమా పథకంలో 9,321 మంది మండల రైతులు నమోదై ఉన్నారని ఆయన వివరించారు.


ఘనంగా ప్రపంచ ఆదివాసి దినోత్సవం



మాట్లాడుతున్న ఎంపీడీఓ మహేష్

జహీరాబాద్ టౌన్: మండల కేంద్రమైన మొగుడంపల్లిలోని గిరిజన బాలికల గురుకుల పాఠశాలలో గురువారం ప్రపంచ ఆదివాసి దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మహేష్ మాట్లాడుతూ గిరిజనుల అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలన్నారు. ఆర్థికంగా, సామాజికంగా అభ్యున్నతి సాధించాలన్నారు. ప్రభుత్వం కూడా గిరిజనుల సంక్షేమానికి కృషి చేస్తుందన్నారు.

సమస్యలు పరిష్కరించాలి



రికార్డులు పరిశీలిస్తున్న ఆర్డీఓ అశోక చక్రవర్తి

నారాయణఖేడ్: నాగల్‌గిద్ద తహసీల్దార్ కార్యాలయాన్ని ఆర్డీఓ అశోక చక్రవర్తి గురువారం తనిఖీ చేశారు. మండలంలో పెండింగ్‌లో ఉన్న బర్త్ సర్టిఫికెట్లు, ధరణి దరఖాస్తులు, కల్యాణలక్ష్మి, షాదీముబారక్ అర్జీలను పరిశీలించారు. త్వరితగతిన సమస్యలు పరిష్కరించాలని తహసీల్దార్ రమాదేవిని ఆయన ఆదేశించారు.

ఉద్యోగులకు వెంటనే డీఏ ప్రకటించాలి



సభ్యత్వ నమోదు నిర్వహిస్తున్న యూటీఎఫ్ నాయకులు

జహీరాబాద్: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఇవ్వాల్సిన డీఏ పెండింగ్‌లో ఉందని, వెంటనే ప్రకటించాలని యూటీఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం మొగుడంపల్లి మండలంలోని పలు పాఠశాలలను సందర్శించి సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు రమేష్, శామయ్యలు మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు డీఏ ప్రకటించాలని కోరారు. రెండో పీఆర్సీ కమిటీ నివేదికపై ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలతో చర్చలు జరిపి 30 శాతం ఫిట్మెంట్‌తో అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు సిరాజుద్దీన్, ప్రశాంత్‌కుమార్, యాదయ్య పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సంక్షేమం కోసం కృషి

రాయికోడ్(అందోల్): ఉపాధ్యాయుల సంక్షేమం కోసం పీఆర్‌టీయూ నిరంతరం కృషి చేస్తోందని ఆ సంఘం మండల అధ్యక్షుడు డి.విఠల్, జిల్లా ప్రధాన కార్యదర్శి మదన్‌మోహన్ చెప్పారు. మండలంలోని కర్చల్ గ్రామంలోని జెడ్పీహెచ్ఎస్, ఎంపీపీఎస్ పాఠశాలల్లో పీఆర్‌టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంఘం కృషి కారణంగానే ఉపాధ్యాయులకు ప్రమోషన్లు వచ్చాయన్నారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు మదన్‌గోపాల్, డి.శ్రీనివాస్, ఎస్.వరాలు, తులసీరామ్ రాథోడ్, చంద్రు రాథోడ్, ప్రశాంత్, రమేశ్, ఎం.శంకర్ పాల్గొన్నారు.



సభ్యత్వ రసీదును అందజేస్తున్న నాయకులు

రోడ్లపై వర్షం నీటిని తొలగించండి



రోడ్డుపై నిలిచిన వర్షం నీటిని పరిశీలిస్తున్న కార్పొరేటర్ పుష్పనగేష్

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రోడ్లపై వర్షం నీరు నిలవకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని రామచంద్రాపురం డివిజన్ కార్పొరేటర్ పుష్పనగేష్ కోరారు. గురువారం డివిజన్ పరిధిలోని కాకతీయ నగర్ కాలనీలో ఆమె పర్యటించారు. రోడ్లపై నిలిచిన వర్షం నీటితో ఇబ్బందులు పడుతున్నామని కాలనీవాసులు వివరించారు. వెంటనే సమస్య పరిష్కారించాలని అధికారులకు సూచించారు.

కనీస వేతనం అమలు చేయండి

మునిపల్లి(అందోల్): పంచాయతీ కార్మికులకు కనీస వేతనం నెలకు రూ.21వేలు అమలు చేయాలని గురువారం ఎంపీడీఓ కార్యాలయం ఎదుట సీఐటీయూ నాయకుల ఆధ్వర్యంలో పంచాయతీ కార్మికులు నిరసన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం సీనియర్ అసిస్టెంట్ చంద్రకళకు వినతి పత్రం అందజేశారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు ఇమ్మానియేల్, సాయిరాం, రవి, భిక్షపతి, ప్రభాకర్, నగేశ్, నవీన్, మల్లేశం, నర్సింహులు పాల్గొన్నారు.



వినతి పత్రం అందజేస్తున్న కార్మికులు

సంక్షిప్త వార్తలు

◆ **స్వచ్ఛదనం.. పచ్చదనం**

న్యాల్‌కల్(జహీరాబాద్): మండలంలోని వివిధ గ్రామాల్లో స్వచ్ఛదనం–పచ్చదనం కార్యక్రమం కొనసాగుతోంది. గురువారం రేజింతల్, హద్నూర్, వడ్డి, మిర్జాపూర్(బి), డప్పూర్ తదితర గ్రామాల్లో అధికారులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, పంచాయతీ కార్యదర్శులు, వైద్య సిబ్బంది పర్యటించి చెత్తాచెదారాన్ని తొలగించారు. మురుగు ప్రాంతాల్లో దోమల నివారణకు మందును పిచికారీ చేయించారు. ఈ సందర్భంగా మొక్కలను నాటారు.

కల్హేర్(నారాయణఖేడ్): కల్హేర్, సిర్గాపూర్ మండలాల్లో స్వచ్ఛదనం–పచ్చదనం గురువారం కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో ఎంపీడీఓలు శ్రీనివాస్, మల్సూర్, పంచాయతీ సెక్రటరీలు పాల్గొన్నారు.

◆ **లబ్ధిదారులకు సీఎంఆర్ఎస్ చెక్కులు**

జహీరాబాద్ టౌన్: పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో గురువారం లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే మాణిక్‌రావు అందజేశారు. పట్టణంతో పాటు పలు గ్రామాలకు చెందిన 30 మందికి రూ.8లక్షల విలువ గల చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు నామ రవికిరణ్, యాకూబ్, బండి మోహన్, అబ్దుల్లా, పద్మజ, తులసీదాస్ గుప్త, అలీం, ఫయాజ్, సందీప్, నరేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

◆ **పాఠశాలల తనిఖీ**

కల్హేర్(నారాయణఖేడ్): మండలంలోని ఖానాపూర్(కె), జంలా తండా పాఠశాలలను కల్హేర్ ఎంఈఓ శంకర్ గురువారం తనిఖీ చేశారు. విద్యాబోధన, పాఠశాల పరిసరాలను పరిశీలించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి పవన్, ప్రధానోపాధ్యాయుడు నాగనాథ్ పాల్గొన్నారు.

◆ **నైట్‌హాల్ట్ బస్సును పునరుద్ధరించాలి**

నారాయణఖేడ్: నారాయణఖేడ్ ఆర్టీసీ డిపో నుంచి కంగి- పిట్లం నైట్‌హాల్ట్ బస్సును పునరుద్ధరించాలని సీపీఐ ఖేడ్ డివిజన్ కార్యదర్శి ఆనంద్, నాయకులు చిరంజీవి, దత్తురెడ్డి, అశోక్, ఇసాక్ కోరారు. గతంలో ఖేడ్ నుంచి రాత్రి 8 గంటలకు కంగ్టి మీదుగా పిట్లంకు బస్సు నడిపేవారని తెలిపారు. బస్సును నిలిపివేయడంతో రాత్రివేళ బస్సులు లేక ఆమార్గంలోని దాదాపు 40 గ్రామాలవారికి ఇబ్బందులు తప్పడంలేదన్నారు. బస్సును పునరుద్ధరించి ఇబ్బందులు దూరం చేయాలని కోరారు.

◆ **ఖేడ్‌లో వీధికుక్కల బెడద**

నారాయణఖేడ్: నారాయణఖేడ్ మున్సిపాలిటీతో పాటు చుట్టుపక్కల గ్రామాల్లో పెద్దసంఖ్యలో విచ్చలవిడిగా సంచరిస్తున్న వీధికుక్కలను అరికట్టాలని డివైఎఫ్ఐ ఖేడ్ డివిజన్ అధ్యక్షులు మహిపాల్ డిమాండ్ చేశారు. వీధికుక్కలు పిల్లలు, వృద్ధులను వెంబడిస్తుండటంతో పిల్లల తల్లిదండ్రులు భయాందోళనలకు గురవుతున్నారని తెలిపారు. పట్టణంలో పరిస్థితి మరీ దారుణంగా తయారైందని వాపోయారు. అధికారులు వెంటనే స్పందించి తగు చర్యలు తీసుకోవాలన్నారు.

◆ **ఉచిత బస్‌పాస్‌లు**

నారాయణఖేడ్: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 500 మంది విద్యార్థులకు అయ్యే బస్‌పాస్ రుసుం రూ.50 వేలను గురువారం ఖేడ్ ఆర్టీసీ డీఎం మల్లేశయ్యకు అందజేశారు. తమ తండ్రి జర్నుగొండ జ్ఞాపకార్థం మనూరు మండలం డోవూరుకు చెందిన న్యాయవాది సంగమేశ్, శివకుమార్, రాజు, వెంకట్ వితరణ అందజేశారు. ఏడాది పాటు 20 కి.మీల పరిధిలో ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా రాకపోకలు సాగించవచ్చని డీఎం తెలిపారు. నాయకులు సుధాకర్‌రెడ్డి, ఆర్టీసీ మార్కెటింగ్‌సెల్ ఇన్‌చార్జి పాండు, జెడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు వెంకట్‌రావు, చరణ్‌సింగ్, జైపాల్‌రెడ్డి, ధన్‌సింగ్, వెంకటేశం పాల్గొని దాతలను సన్మానించారు.

◆ **ముట్టడికి తరలిరండి**

జహీరాబాద్ టౌన్: ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 12న చేపట్టనున్న ఆర్డీఓ కార్యాలయం ముట్టడి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీపీఎం కార్యదర్శి మహిపాల్ కోరారు. గురువారం కరపత్రం విడుదల చేశారు. పది రోజుల పాటు పట్టణంలో పార్టీ చేపట్టిన బస్తీ బాట కార్యక్రమంలో ప్రజల నుంచి స్పందన వచ్చిందన్నారు. రోడ్లు, మురుగు కాలువలు, పార్కుల అభివృద్ధి, అర్హులకు రేషన్ కార్డులు, క్రీడా ప్రాంగణంలో వసతుల కల్పన, డబుల్ బెడ్రూం తదితర సమస్యలు దృష్టికి వచ్చాయన్నారు. ప్రజా సమస్యల పరిష్కరం కోసం ఆర్డీఓ కార్యాలయాన్ని ముట్టడించనున్నట్లు తెలిపారు. కార్యక్రమాన్ని విజయవం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు సలీమొద్దీన్, శాంతమ్మ, ముతబీర్, రాజులు పాల్గొన్నారు.

◆ **ఐక్యంగా ఉద్యమించాలి**

సంగారెడ్డి టౌన్ : కార్మిక రంగం ఐక్యంగా ఉద్యమించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి సాయిలు అన్నారు. గురువారం పట్టణంలోని సంఘం కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ అనుకూలంగా పనిచేస్తోందన్నారు. ప్రభుత్వ సంస్థలన్నీ కార్పొరేట్‌కు అప్పజెప్పడంతో కార్మికులు వారి హక్కులను కోల్పోతున్నారన్నారు. వాటిని కాపాడుకునేందుకు ఉద్యమాలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్మిక వర్గాలన్నీ ఏకం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు, ఏఐటీయూసీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

◆ **జూనియర్ అసిస్టెంట్ల బదిలీలు**

పటాన్‌చెరు టౌన్: మండల పరిధిలోని రుద్రారం గణేష్ గడ్డ దేవస్థానం జూనియర్ అసిస్టెంట్, అమీన్‌పూర్ పరిధిలోని బీరంగూడ భ్రమరాంబ మల్లికార్జున దేవస్థానం జూనియర్ అసిస్టెంట్ గురువారం బదిలీ అయ్యారు. బీరంగూడ దేవస్థాన జూనియర్ అసిస్టెంట్‌గా సోమేశ్వరరావు బదిలీపై గణేష్‌గడ్డ దేవస్థానానికి రాగా, గణేష్‌గడ్డ దేవస్థానంలో విధులు నిర్వరిస్తున్న మల్లికార్జున్‌రెడ్డి బదిలీపై బీరంగూడలోని మల్లికార్జున స్వామి దేవస్థానానికి వెళ్లారు. ఈసందర్భంగా ఇరువురిని అర్చకుల బృందం సన్మానించారు.

◆ **పంచాయతీ కార్మికుల ధర్నా**

జోగిపేట(అందోల్): గ్రామ పంచాయతీ కార్మికుల పెండింగ్ వేతనాలు చెల్లించాలని కనీస వేతనం, ఈఎస్ఐ పీఎఫ్ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం జోగిపేటలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎంపీడీఓ కార్యాలయ సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ కార్యదర్శి విద్యాసాగర్, పంచాయతీ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

◆ **ధ్యానంతో ఒత్తిడి దూరం**

పటాన్‌చెరు: ఒత్తిడిని అధిగమించడానికి ధ్యానం అత్యుత్తమ మార్గమని విపాసనా యోగా శిక్షకులు డాక్టర్ భాస్కర్, మార్కండేయులు, పీటీ రెడ్డి అభివర్ణించారు. మండలంలోని రుద్రారం గీతం స్కూల్ ఆఫ్ ఫార్మసీలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో వారు పాల్గొని, మార్గదర్శనం చేశారు. ఆధునిక జీవితంలోని సవాళ్లను అధిగమించడానికి ప్రభావవంతమైన పద్ధతుల అవసరాన్ని వారు ప్రస్తావించారు. కార్యక్రమ సమన్వయకర్త డాక్టర్ శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.